ఆఖిరి మజిలీకి జాగా కరువు

- కొత్తూరు ఆర్‌అండ్‌ఆర్ ప్రజల వెతలు
- అంత్యక్రియలకు పలు అవస్థలు

కొయ్యలగూడెం: శ్మశాన వాటిక లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ పోలవరం నిర్వాసితులైన కొత్తూరు ఆర్‌అండ్‌ఆర్ ప్రజలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. కొత్తూరు ఆర్‌అండ్‌ఆర్ ప్రాంతవాసి కోమల పాపయమ్మ మృతి చెందడంతో ఆమెకు దహన సంస్కారాలు సరిపల్లి నుంచి పరింపూడిలో ఉన్న కోనేరులో నిర్వహించాల్సి వచ్చింది. కొత్తూరు నిర్వాసితులకు ప్రభుత్వం సుమారు ఆరు సంవత్సరాల క్రితం శ్మశాన వాటికను సరిపల్లి ప్రాంతంలో కేటాయించారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర దూరం మృతదేహాలను తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లకుండా సమీపంలోని చెరువులోనే కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారన్నారన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు కొత్తూరు ప్రాంతాన్ని సందర్శిస్తున్న సమయాల్లో సమస్యను వారి దృష్టికి తీసుకెళుతున్నా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చేపట్టారు. చివరకు హామీ ఇవ్వడానికి ఏ ఒక్కరు కూడా ముందుకు రాకపోవడంతో మృతదేహాన్ని పరింపూడికి చెందిన కోనేరులోనే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మనిషి చనిపోయిన దాని కంటే శ్మశానం లేక మృతదేహానికి అంత్యక్రియలు చేయడమే పెద్ద సమస్యగా ఉందని, కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కాగా దీనిపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా కొత్తూరు నిర్వాసితులు ఉన్న ప్రాంతం ఇళ్ల నిర్మాణానికే సరిపోయిందని సమీపంలో ఉన్న రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి శ్మశానానికి కేటాయించాల్సి ఉందని తెలిపారు.


శ్మశానం లేక వేరే చోట మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

జంగారెడ్డిగూడెం: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిల్ పని చేస్తుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో గతంలో సాధారణ నిధుల నుంచి రూ.32 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు ప్రారంభించారన్నారు. కానీ అప్పటి ఎన్నికల కారణంగా సీసీ రోడ్డు పనులు వాయిదా వేశారని, ఇప్పుడు ఆ రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొమ్మని వెంకటరమణ, కో-ఆపరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, గుబ్బల అబ్బాస్, గెద్దాడ శ్రీనివాసరావు, కంచుమర్తి ప్రకాష్, తల్లాడ శ్రీను, జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

పశువులకు బీమా తప్పనిసరి

కొయ్యలగూడెం: పశువులకు బీమా తీసుకోవడం వలన విపత్కర పరిస్థితుల్లో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల పశు వైద్యశాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బయ్యనగూడెంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, యువజన నాయకుడు మద్దు తేజ ప్రారంభించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయని వాటికి బీమా వర్తించకపోవడంతో పశు పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. బీమా పథకంపై రైతులకు అవగాహనకు సంబంధించి, వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా సుమారు ఆరు వందల మేకలకు ఫాక్స్ వ్యాక్సిన్ వేశారు. అదే విధంగా 80 పశువులకు, 200 కోళ్లకు సంబంధించి ఔషధాలను, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఎక్సైజ్ అధికారుల దాడులు


చింతలపూడి: పట్టుబడిన నిందితులు


కొయ్యలగూడెం: నిందితులతో ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో సుప్రీంపేటకు చెందిన కొమ్మిగిరి మాధవిని అరెస్ట్ చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సీహెచ్ శ్రీనివాసరావు అలియాస్ మసాలా శ్రీను అనే వ్యక్తి నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, హెడ్ కానిస్టేబుల్ పి.పురుషోత్తం, కానిస్టేబుళ్లు రమేష్, సత్యనారాయణ, ఎ. శివప్రియ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సారా విక్రయానికి సంబంధించి నాలుగు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం మంగళవారం పేర్కొన్నారు. ఎర్రంపేట గ్రామానికి చెందిన అక్కబత్తుల గంగమ్మ ఐదు లీటర్ల సారాతో గ్రామంలో పట్టుబడిందన్నారు. అదే విధంగా కొయ్యలగూడెనికి చెందిన చల్లారి రమాదేవి, ఐదు లీటర్లతోనూ పాత సారా కేసులకు సంబంధించి కాగిత రాంబాబు, ముద్రగడ సత్తిబాబులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బకాయి వేతనాలను విడుదల చేయాలి

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఐదు నెలల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ 18 నెలల పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐలను ఈ నెల 23వ తేదీ లోపు విడుదల చేయకపోతే 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. ఈ నెల 12వ తేదీన సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, ఏలూరు డీసీహెచ్‌ఎస్‌లకు తెలియజేశామని అన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వ వర్గాల నుంచి గాని, కాంట్రాక్టర్ నుంచి గాని ఎటువంటి స్పందన లేకపోవడం వలన నిరవధిక సమ్మెలోకి వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పారిశుద్ధ్య విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, వెంకట్రావు, సునీత, రామకృష్ణ, వి.వాణి, తదితరులు పాల్గొన్నారు.


ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

అక్రమ కలప పట్టివేత


గ్రామస్తుల సహకారంతో పట్టుకున్న అక్రమ కలపను చూపిస్తున్న ఫారెస్ట్ అధికారులు


అక్రమ కలప ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం: అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కలపతో సహా సీజ్ చేసినట్లు కన్నాపురం రేంజ్ అధికారి ఎ.శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అక్రమ కలప రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆ సమయంలో రెడ్డికుంకల గ్రామస్తుల సహకారంతో కుంకాల బీట్ నుంచి అక్రమంగా తరలించే కలపను పట్టుకున్నామన్నారు. అక్రమంగా కలప రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కలప అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్థానికులు సహకరించాలన్నారు. ఈ దాడుల్లో అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రిలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్మైల్ ట్రెన్ ఆర్గనైజేషన్ సహకారంతో ఆర్‌బీఎస్‌కే-డీఈఐసీ విభాగంలో నిర్వహించినట్లు డీఈఐసీ-ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. పెదవి, అంగిలి చీలిక బాధితులకు శస్త్ర చికిత్స నిమిత్తం వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. చిన అవుటపల్లి సిద్ధార్థ దంత వైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ జి.శ్రీకాంత్ వైద్య సేవలు అందించారన్నారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుంచి తొమ్మిది మంది బాధితులు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ బేబీ కమల, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వి.రాంబాబు, ఆర్‌బీఎస్‌కే మెడికల్ అధికారి సీహెచ్ లూక స్టీఫెన్ లేవీ, ఆర్‌బీఎస్‌కే దంత వైద్యనిపుణులు ఎం.మహిత, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


ఏరియా ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి

బుట్టాయగూడెం: చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం నిర్మాణాలు ప్రదేశంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ చట్టాలకు వ్యతిరేకంగా బుట్టాయగూడెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళితే ఎల్టీఆర్ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎస్‌డీసీ కోర్టులో రెండు వాయిదాలకు కూడా తిరిగామన్నారు. అయితే ఇటీవల ఆర్‌డీఓ నుంచి అనుమతులు వచ్చాయంటూ మళ్లీ నిర్మాణాలు చేపట్టారని వాటిని ఉన్నతాధికారులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారం భాస్కర్, కారం ముత్యాలరావు, ఎస్.శ్రీనివాస్, ఎం.అనూష, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

24న ముగింపు సభ

వేలేరుపాడు: 24న జరిగే లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ పిలుపునిచ్చారు. వేలేరుపాడులో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీ రూపుమాపే వరకు కమ్యూనిజం ఉంటుందన్నారు. కమ్యూనిజానికి ఎదురులేదని ప్రపంచంలో అనేక దేశాల్లో యువకులు మేధావులు మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తున్నారని, పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి, సోషలిస్ట్ వ్యవస్థను కోరుకుంటున్నారన్నారు. లెనిన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాటాలు చేయాలన్నారు. కావున జనవరి 24న జంగారెడ్డిగూడెంలో జరిగే ముగింపు లెనిన్ శత వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గద్దాల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

ఇద్దరు పిల్లలపై వీధి కుక్కల దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలను కుంటలో కీర్తి ప్రియాంక అనే బాలికపై, తిరుమలంపాలెంలో వరుణ్‌తేజ్ అనే బాలుడిపై వీధి కుక్కలు మంగళవారం దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన పిల్లలను స్థానికులు ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి, ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించారు. వీధి కుక్కల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంగిడిగూడెంలో పొలం పిలుస్తోంది

జంగారెడ్డిగూడెం: వ్యవసాయశాఖ అందిస్తున్న సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఓ.హబీబ్‌బాషా, కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకుడు పీజీ బుజ్జిబాబు అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి, మొక్కజొన్నలో సాగు పద్ధతులను వివరించారు. రైతులు పొలాల్లో పురుగులు, తెగుళ్లను వారే తెలుసుకొని వాటి నివారణకు కావాల్సిన సూచనలు ఇచ్చే యాప్ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం) గురించి అవగాహన కల్పించారు. ఈ యాప్‌లో రైతులు సస్యరక్షణ చర్యలను స్వయంగా తెలుసుకొనే వీలుంటుందన్నారు. ఇది ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా తమ ఫోన్లలో యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌పురం ఏడీఏ బుజ్జి బాబు మాట్లాడుతూ రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం నిపుణులు కళ్యాణ్ మాట్లాడుతూ అగ్ని అస్త్రం తయారీ, వాడుక గురించి, వాటి ఉపయోగాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ పోశారావు, సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, లింగాల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

● మంచు కురిసే వేళలో..


మంచును చీల్చుకొని వెళుతున్న వాహనాలు

చింతలపూడి: చింతలపూడిలో మంగళవారం విపరీతమైన పొగ మంచు కురిసింది. ఉదయం తొమ్మిది గంటలకు కూడా మంచు తెరలు వీడ లేదు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సూర్యుడు కూడా మంచు తెరల చాటున దాగున్నాడు.


మంచు ముసుగులో ప్రకృతి

క్లుప్తంగా

పింఛన్ల తనిఖీ


పింఛన్‌దారుడిని ప్రశ్నిస్తున్న టీం అధికారులు

కొయ్యలగూడెం: ప్రభుత్వం అనారోగ్య లబ్ధిదారులకు ఇస్తున్న పింఛన్ల తనిఖీ మంగళవారం నిర్వహించినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రెండు బృందాలుగా ఏర్పడిన అధికారులు మొత్తం 18 పంచాయతీల పరిధిలో ఉన్న పెన్షన్‌దారులను తనిఖీ చేసి వారి వద్ద నుంచి వివరాలు, ధ్రువీకరణ పత్రాలు సేకరించామన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 47 ఏడు మంది అనారోగ్య పరిస్థితుల రీత్యా మంచానికి పరిమితమై ప్రతి నెలా రూ.15 వేల పింఛన్ పొందుతున్నారన్నారు. కొందరు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించినట్లుగా తెలిపారు. ఇదే విధంగా మిగిలిన పింఛన్‌దారులను కేటగిరీలుగా విభజించి వారివి కూడా పరిశీలిస్తామని తెలిపారు.

దివ్యాంగుల పింఛన్ వెరిఫికేషన్


దివ్యాంగుల పింఛన్లను వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

పోలవరం రూరల్: మండలంలో మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్న 23 మంది దివ్యాంగుల పింఛన్‌దారులను వైద్యాధికారులు పరిశీలించారు. రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ప్రభుత్వం వైద్య బృందాన్ని ఏర్పాటు చేసిందని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం, గూటాల, పట్టిసీమ, ఎల్ఎన్‌డీపేట, ప్రగడపల్లి గ్రామాల్లో 23 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. డాక్టర్ బి.గాంధీ ఆధ్వర్యంలో స్థానిక అధికారులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు.

ప్రపంచ ఖోఖో విజేతకు శుభాకాంక్షలు


భారత ఖోఖో జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ 78 అంకెతో కూర్చున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: ప్రపంచ ఖోఖో విజేతగా భారత్ నిలిచినందుకు పరింపూడి జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నేపాల్ జట్టుపై భారత జట్టు 78-40 పాయింట్ల తేడాతో గెలిచినందుకు అభినందిస్తూ 78 అక్షరాకృతితో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు.

సాగు పట్టాలివ్వాలి


ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఎర్ర కాలువ ప్రాజెక్ట్ మిగులు భూములైన జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లో సాగు చేస్తున్న పేదలకు సాగు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. జంగారెడ్డిగూడెం ఇరిగేషన్ కార్యాలయం వద్ద మంగళవారం భూమి లేని పేదలు, దళితులు, గిరిజనులతో ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించగా, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, సంఘం జిల్లా నాయకురాలు మడకం సుధారాణి, గుండెల్లి వెంకట్రావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్‌లు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం గ్రామంలో నిర్మించిన కరాటం కృష్ణమూర్తి ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు లేని మిగులు భూముల్లో పేదలకు సాగుకు అవకాశం ఇవ్వాలన్నారు. 2024లో హైకోర్టును ఆశ్రయించగా పేదలు సాగు చేస్తున్న పంటలకు రక్షణ కల్పించాలని, వారికి సాగు హక్కు కల్పించాలని తీర్పు ఇచ్చిందన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇరిగేషన్ కార్యాలయం సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో. యా గంటి సీత, పటాన్ మస్తాన్, సీహెచ్ లక్ష్మీనారాయణ, మొగలి మంగ, వాణి పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం వాయిదా

దెందులూరు: గోపన్నపాలెంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాల్సిన దెందులూరు నియోజకవర్గం స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశారు. స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ దెందులూరు నియోజకవర్గం సెక్రటరీ మేదనరావు పాలెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తమల పాకులతో అంజన్నను పూజించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి పలు సేవల రూపేణా రూ.1,30,019 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1200 మంది భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలోల అన్న ప్రసాదాన్ని అందించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లను చేశారు.

ఘర్షణపై డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ రవిచంద్ర

కామవరపుకోట: సంక్రాంతికి నిర్వహించిన కోడి పందేల్లో కామవరపుకోట మండలంలోని రామన్నపాలెం పంచాయతీ మారుతీనగర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర మంగళవారం విచారణ చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకొని ఘర్షణపై ఆరా తీశారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తడికలపూడి ఎస్సై చెన్నారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ లక్ష్మీసుజన

ద్వారకాతిరుమల: మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ద్వారకాతిరుమల-2 సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీసుజన అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీశ్రీనివాస జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆమె మంగళవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మొదటి గంట ఎంతో క్లిష్టమైందని, అందుకే దాన్ని గోల్డెన్ అవర్ అంటారని తెలిపారు. ప్రమాదానికి గురై సకాలంలో వైద్యం అందక ఎంతో మంది చనిపోతున్నారని అన్నారు. దేశంలో ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.50 లక్షల మంది చనిపోతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవ పోస్టర్ల విడుదల

దెందులూరు: మండలంలోని గాలయగూడెంలో శ్రీఅచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాల పోస్టర్లను మంగళవారం కొవ్వలిలో ఆయన నివాసంలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) విడుదల చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మవారి ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు గారపాటి చౌదరికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. దెందులూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.బుజ్జి గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.